క్లుప్తంగా

రజత కాసులపేరు బహూకరణ


రజత కాసులపేరు అలంకరణలో కామేశ్వరి అమ్మవారు

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రు గ్రామంలో ఉన్న కామేశ్వరి అమ్మవారికి కాకినాడకు చెందిన బులుసు శంకర్రావు రజత కాసుల పేరును తయారు చేయించి ఆలయ అర్చకులకు అందజేశారు. ఈ మేరకు పండితులు కాసులపేరుకు ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం అమ్మవారికి అలంకరించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, మినీ అంగన్‌వాడీ వర్కర్లు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ వి.మాధవి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. తాళ్లరేవు మండలంలో పిల్లంక అంగన్‌వాడీ కార్యకర్త, ఉప్పంగల, ఇంజరం సింగరాయ చెరువు, కాజులూరు మండలంలో పెనుమళ్ల ఎస్సీపేట, కాజులూరు శ్రీరాంనగర్‌లో అంగన్‌వాడీ సహాయకురాళ్ల పోస్టుల భర్తీకి అర్హులైనవారు ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి పాసై 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు దరఖాస్తు చేసుకోవొచ్చని తెలిపారు.

సౌరయాగంలో మామిడి చెట్టుకు పూజలు


విలసవిల్లిలో రామమందిరం వద్ద గోపూజ చేస్తున్న భక్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లిలో జరుగుతున్న నవగ్రహ నక్షత్ర పూర్వక మహా సౌరయాగంలో భాగంగా అర్చకులు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పండితులు సోమవారం పూర్వాభద్ర నక్షత్ర జాతకులచే మామిడి చెట్టుకు పూజలు చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి గోపూజ, ఆదిత్య పఠనం చేశారు. కార్యక్రమంలో కొవ్వలి ఫౌండేషన్ అధినేత కొవ్వలి యతిరాజా రామ్మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం


యానాం: నియోజకవర్గ పరిధిలో అదనపు హైటెన్షన్(హెచ్‌టీ) విద్యుత్ లైన్ల మరమ్మతుల పనుల నిమిత్తం ఈ నెల 14వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ లంక కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులను అభినందిస్తున్న సర్పంచ్ కామాడి గోవలక్ష్మి తదితరులు

తాళ్లరేవు: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో ఖోఖో, కబడ్డీ పోటీల్లో నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సోమవారం చినవలసల పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కామాడి గోవలక్ష్మి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోవలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ తదితరులు మాట్లాడుతూ వారు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు కామాడి మాతరాజు, వీఆర్వో పలివెల అర్జునరావు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ పెంచాలంటూ ర్యాలీ


కలెక్టరేట్ వద్ద ర్యాలీ చేస్తున్న దివ్యాంగులు

అమలాపురం రూరల్: దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్ రూ.10 వేలకు పెంచాలంటూ జిల్లా దివ్యాంగుల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు పెనుమాల నాగరాజు, మోటూరి వెంకటేశ్వరరావు, నిమ్మకాయల సురేష్‌లు దివ్యాంగులకు బ్యాక్‌లాగ్ పోస్టుల్లో న్యాయం చేయాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ జేసీ నుపూర్ అజయ్‌కు వినతిపత్రం అందించారు.

ఈ-క్రాప్‌తో బహుళ ప్రయోజనాలు

- శరవేగంగా సాగుతున్న ఈ-క్రాప్ నమోదు
- ఫిబ్రవరి 15తో ముగియనున్న గడువు


గోపవరంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఉప్పలగుప్తం: విత్తు నుంచి విక్రయం వరకూ అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలబడుతోంది. వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలను అందజేస్తుంది. ప్రభుత్వ పథకాలను నిజమైన లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ-క్రాప్‌ను ప్రామాణికంగా తీసుకుంటోంది. రైతులు ఈ-క్రాప్ చేయించుకోకపోతే పంట అమ్ముకోవాలనుకున్నా, బ్యాంకుల నుంచి రుణాలు పొందాలన్నా, వ్యవసాయ పరికరాలు తీసుకోవాలనుకున్నా, ఆఖరికి ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటల బీమా దక్కించుకోవాలనుకున్నా సాధ్యపడదు. అందుకే అన్నదాతలంతా బహుళ ప్రయోజనాలున్న ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలోనూ వ్యవసాయ సిబ్బంది ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. రైతు ఏయే సర్వే నెంబర్లలో, ఎంతెంత విస్తీర్ణంలో, ఏయే పంటలు సాగు చేస్తున్నారో ఈ-క్రాప్‌లో నమోదు చేస్తున్నారు. పంట నమోదులో పొరపాట్లకు తావులేకుండా జియోఫెన్సింగ్ విధానంలో ఎంపిక చేసిన సర్వే నెంబర్‌లో సాగు చేసిన పొలంలోనే సంబంధిత రైతును నిలబెట్టి ఫొటో తీసి వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. రైతులు తాము సాగు చేసే భూమిలో ఎన్ని సర్వే నెంబర్లు ఉంటే అన్నీ యాప్‌లో నమోదు చేయించుకోవాలి. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వీఏఏ, వీహెచ్‌ఏల ద్వారా ఈ-క్రాప్ నమోదు నిర్వహిస్తున్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న ప్రతీ రైతుకు సంబంధించిన మొబైల్ నెంబర్‌కు మెసేజ్ రూపంలో డిజిటల్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ వెళుతుంది. ఈ-క్రాప్ చేసిన తర్వాత రైతు ఈకేవైసీలో తన వేలిముద్రను వేయాల్సి ఉంటుంది.

ఈ విధానంతో కచ్చితమైన సమాచారం అందడంతో రైతులకు ప్రభుత్వ పథకాల ఫలాలు అంది ప్రయోజనం చేకూరుతుంది. ఈ నెల 15వ తేదీ నాటికి ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసేలా వ్యవసాయశాఖ అధికారులు కసరత్తులు చేస్తున్నారు. రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుంటే సాగుకు అవసరమైన సూచనలు, సలహాలు వ్యవసాయశాఖ అధికారులు అందజేస్తారు. దీంతో పాటు రాయితీపై విత్తనాలు, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రాయితీ తదితర ప్రయోజనాలు పొందే వీలుంటుంది.

అమలాపురం నియోజకవర్గంలో ఈ-క్రాప్ నమోదు ప్రగతి

మండలం	సాగు (ఎకరాల్లో)	ఈ-క్రాప్ నమోదు (ఎకరాల్లో)
ఉప్పలగుప్తం	6595	5800
అమలాపురం	5164	5064
అల్లవరం	4200	4000

ఫిబ్రవరి 15లోగా నమోదు చేసుకోవాలి



నాట్లు వేసిన ప్రతి రైతు ఈ-క్రాప్‌లో తమ సాగు వివరాలను పక్కాగా నమోదు చేసుకోవాలి. దీని ఆధారంగానే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, రాయితీలు అందుతాయి. నమోదులో ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా చూసుకుంటున్నాం. ఫిబ్రవరి 15లోగా రైతులంతా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి.

– జి.కుమార్‌బాబు, వ్యవసాయాధికారి, ఉప్పలగుప్తం మండలం

మత్స్యకార గ్రామాల అభివృద్ధికి కృషి


అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్

యానాం: మత్స్యకార గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు విశేష కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సావిత్రినగర్‌లో రూ.1.15 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. రూ.30.72 లక్షలతో సావిత్రినగర్ న్యూకాలనీలో మంచినీటి పైపులైను, రూ.39.52 లక్షలతో ప్రభుత్వ మినీ సివిల్ స్టేషన్ మరమ్మతుల పనులు, బెజవాడ గార్డెన్స్‌లో రూ.27.75 లక్షలతో సిమెంట్ రోడ్డు, శ్రీరామ్‌నగర్‌లో రూ.23.47 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, పీడబ్ల్యూడీ ఏఈ కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారికి శంకుస్థాపన


గోవలంకలో సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: మండలంలోని గోవలంక పంచాయతీ పరిధిలో రూ.4 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించనున్న సీసీ రహదారికి ఎంపీపీ రాయుడు సునీత సోమవారం శంకుస్థాపన చేసారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొరుకొండ సింహాద్రమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మోర్త భీమాబాయి, కూరాటి శ్రీకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, పంచాయతీ కార్యదర్శి వలీబాబు, నాయకులు కోరుకొండ చంటి, మోర్త నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు బస్‌స్టేషన్‌కు శంకుస్థాపన

అమలాపురం రూరల్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో అమలాపురం డిపోలో రూ.5 కోట్లతో 24 ప్లాట్‌ఫాంలతో అత్యాధునికంగా నిర్మించనున్న నాలుగు అంతస్తుల బస్‌స్టేషన్‌కు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం ఉదయం 9.30 గంటలకు శంకుస్థాపన చేస్తారని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని నాని తెలిపారు. మంత్రి విశ్వరూప్‌తో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు.

అమ్మ రుణం తీర్చుకున్నా

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్


పల్లంలో మంచి నీటి ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తల్లి రామానుజమ్మ

కాట్రేనికోన: మా అమ్మ పుట్టిన ఊరు పల్లం గ్రామానికి శాశ్వత రక్షిత మంచి నీటి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి ఇంటింటికీ రక్షిత నీటిని అందించి అమ్మ రుణం తీర్చుకున్నానని టీటీడీ పాలకవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని పల్లంలో ఓఎన్‌జీసీ సీఎస్‌ఆర్ నిధులు రూ.4.50 కోట్లతో పీడబ్ల్యూఎస్ ప్రాజెక్టు పనులను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ తల్లి రామానుజమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.86 లక్షలతో ఇంటింటికీ మంచినీటి కుళాయి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ అమ్మకు ఇచ్చిన మాట కోసం పల్లం గ్రామంలో శాశ్వత రక్షిత మంచి నీటి ప్రాజెక్టును ఏర్పాటు చేసి రక్షిత మంచి నీటిని అందించడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో అండగా నిలిచి ఫ్యాను గుర్తుకి ఓటు వేసి గెలిపించాలన్నారు. చిర్రయానంలో సీఎస్‌ఆర్ నిధులు రూ.33 లక్షలతో ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకు, జల జీవన మిషన్ నిధులు రూ.43 లక్షలతో మంచి నీటి కుళాయిలను ఆయన ప్రారంభించారు. కాట్రేనికోన పంచాయతీ పరిధి నాగపట్టణంలో సీఎస్‌ఆర్ నిధులు రూ.41 లక్షలతో నిర్మించిన ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచులు మల్లాడి వీరబాబ్జి, ఓలేటి మంగాదేవి, గంటి వెంకట సుధాకర్, నేల కిషోర్, పాలెపు ధర్మారావు, నల్లా నరసింహమూర్తి, ఏడిది సుబ్బు, నాతి సత్యనారాయణ, సంసాని నాగేశ్వరరావు, కోలాటి సత్యం, కోలా మీరయ్య, మల్లాడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మా స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయించండి


స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసిన బాధితులు

అల్లవరం: మండలంలోని నల్లగుంట గ్రామంలో పేదలందరికీ ఇళ్ల పథకంలో 2020లో ఇళ్ల స్థలాలు పంపిణీ చేసినా తమ పేర్లు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని, రిజిస్ట్రేషన్ సైతం కావడం లేదని అమలాపురం స్పందన కార్యాలయంలో బాధితులు జల్లి అనుపమ, యలమంచిలి పార్వతి, యలమంచిలి గంగాభవాని, చోడే వరలక్ష్మి, విప్పర్తి గనికమ్మ, గెద్దం రమణ సోమవారం ఫిర్యాదు చేశారు. 2020లో 109 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ప్లాట్‌లు కూడా కేటాయించారన్నారు. అయితే తమకు కేటాయించిన స్థలాలనే ఇటీవల మరికొందరికి పట్టాలుగా పంపిణీ చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ముగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వీఆర్వో, సచివాలయ సిబ్బందికి తెలియజేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేసి గతంలో తమకు కేటాయించిన స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని వారు కోరారు. తమ స్థలాలను వేరే వాళ్లకు కేటాయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు


అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులు

యానాం: గుజరాత్‌లో ఈ నెల 16వ తేదీ నుంచి 18 వరకూ జరిగే నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ పోటీలకు యానాం నుంచి 10 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు యానాం డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాపగంటి శేషసుమన్, కార్యదర్శి చింతా వెంకన్న సోమవారం విలేకరులకు తెలిపారు. దవులూరి జాషువా, పినిపే వినయ్‌పాల్, కడలి హారిక, మట్టపర్తి తేజస్వినీ షణ్మిత, ఎడిసన్, ఎం.దీపక్ ఎంపికయ్యారన్నారు. వారి వెంట కోచ్ గంధం గంగాధర్, మేనేజర్ మట్టపర్తి గణేష్ వెళతారన్నారు. కార్యక్రమంలో పీఈటీ నక్కల సుబ్బన్న పాల్గొన్నారు.

రూ.4.44 కోట్లతో సీహెచ్‌సీ అభివృద్ధి


నాబార్డు నిధులతో అభివృద్ధి చేసిన తాళ్లరేవు సామాజిక ఆస్పత్రి


ఆస్పత్రి పైఅంతస్తులో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన వార్డులు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులో ఉన్న 30 పడకల ప్రభుత్వ సామాన్య ఆస్పత్రిని రూ.4.44 కోట్ల నాబార్డు నిధులతో అభివృద్ధి చేశారు. ఆయా పనుల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనం పై మరో అంతస్తు నిర్మించి సెంట్రల్ ఏసీ సౌకర్యంతో రెండు వార్డులు, 12 గదులను అందుబాటులోకి తీసుకొచ్చారు. అత్యాధునిక సౌకర్యాలతో ఆపరేషన్ థియేటర్‌లు, ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ చొరవతో ఆస్పత్రిని అభివృద్ధి చేయడంతో పాటు పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించారని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు అద్దంకి లక్ష్మీనారాయణ తెలిపారు. ఆసుపత్రిని ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ మంగళవారం ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. శరవేగంగా జరగుతున్న ఆస్పత్రి అభివృద్ధి పనులను ఆయన వైద్యులు అరవింద్‌తో కలిసి సోమవారం పరిశీలించారు.

రైల్వే లైనుకు నిధులు కేటాయించడంపై హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ దివాకర్

అమలాపురం రూరల్: కోటిపల్లి–నర్సాపురం రైల్వేలైనుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వాటాగా రూ.50 కోట్ల నిధులను కేటాయించడంపై కోనసీమ రైల్వే సాధన సమితి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మండలం పరిధిలో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో జేఏసీ చైర్మన్ వి.దివాకర్ అధ్యక్షతన జేఏసీ సభ్యులు సమావేశమయ్యారు. నిధులు మంజూరైనా కోటిపల్లి గౌతమి నది సమీపంలో గడ్డర్ల నిర్మాణ పనులు పూర్తి కాకపోవటంతో పలువురు సభ్యులు విజయవాడ సౌత్ సెంట్రల్ కార్యాలయంకు ఫోన్ చేసి ఆరా తీశారు. గడ్డర్లకు సంబంధించి బ్లూప్రింట్ సిద్ధం చేస్తున్నామని, అది పూర్తవగానే సంబంధిత నిర్మాణ సంస్థ పనులు ప్రారంభిస్తుందని అధికారులు స్పష్టత ఇచ్చారంటూ సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో బండారు రామ్మోహన్ నాయుడు, ప్రగడ వేణుగోపాల్, కరాటం ప్రవీణ్, రంకిరెడ్డి కాశీ విశ్వనాథం, రాయుడు శ్రీరామ చంద్రమూర్తి, నంద్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను కాపాడుకుందాం


ఆడపిల్లలను కాపాడాల్సిన ఆవశ్యకతపై విద్యార్థులు నిర్వహిస్తున్న ర్యాలీ

యానాం: మగవారితో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణిస్తున్న ఆడపిల్లలను కాపాడుకుందామంటూ నినదిస్తూ స్థానిక దరియాలతిప్ప అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చిన్నారులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ఆడపిల్లలను కాపాడాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మకావాలి.. భార్య కావాలి.. సోదరి కావాలి.. మరి కూతురు ఎందుకు వద్దు..? అంటూ విద్యార్థులు చేసిన ప్రదర్శన అందరినీ ఆలోచింపజేసింది. ప్రస్తుతం ఆడపిల్లలపై వివక్ష ప్రదర్శిస్తూ గర్భంలో ఉండగానే భ్రూణహత్యలకు పాల్పడుతున్నారంటూ పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బాలికలకు పలు ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బొంతు సత్యశ్రీనివాస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సంఘం ఉపాధ్యక్షుడిగా నరసింహమూర్తి


నరసింహమూర్తి

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు అధ్యాపక సంఘం ఉపాధ్యక్షుడిగా అమలాపురానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, తెలుగు అధ్యాపకుడు నల్లా నరసింహమూర్తిని నియమించినట్లు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పత్తిపాటి రమేష్‌నాయుడు తెలిపారు. ఈ నియామక ఉత్తర్వులు సోమవారం నల్లా నరసింహమూర్తికి పంపించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తిని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తి మండ ప్రతాప్, కన్వీనర్ కొల్లి రమావతి, జి.ఈశ్వరి భూషణం, చిట్టి లలిత, ఎస్.గోపి, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజు తదితరులు అభినందించారు.

నమస్తే పథకంలో నమోదుకు ప్రత్యేక క్యాంప్

అమలాపురం టౌన్: స్థానిక పురపాలక సంఘం కార్యాలయం వద్ద నమస్తే పథకంలో సఫాయి కార్మికుల వివరాల నమోదు కోసం సోమవారం ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌కు 44 మంది సఫాయి కార్మికులు హాజరై తమ వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంక్ డ్రైవర్స్, హెల్పర్స్, పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసమే నమస్తే పథకం తీసుకొచ్చారన్నారు. పథకంలో పేర్లు నమోదు చేసుకుంటే రూ.30 లక్షల ప్రమాదబీమా, ఉచిత వైద్యం కోసం ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు, కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, నమస్తే స్కీం స్టేట్ కోఆర్డినేటర్ ఎం.వినయతేజ, రెడ్డి సత్యనారాయణ, ఏఈ కె.వెంకటేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు: రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో ఆలమూరుకు చెందిన విద్యార్థులు చక్కని ప్రతిభను కనబర్చి పతకాలు సాధించారు. అమలాపురంలోని సాధికాన్ ఫౌండేషన్ హాలులో ఇటీవల రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో వైట్ బెల్ట్ ఏ-విభాగంలో గెద్దాడ జ్యాయ్ కిరణ్ (బంగారు) బి-విభాగంలో ఆర్.నాగవెంకట అఖిల్ (వెండి) పతకాలు సాధించినట్టు కోచ్ టి.వెంకటలక్ష్మి సోమవారం విలేకరులకు తెలిపారు. అలాగే జూనియర్ విభాగంలో కట్టా అనుశ్రీ కార్తీక్, గ్రీన్ బెల్ట్ ఏ-విభాగంలో జి.వీరబాబు బంగారు పతకాలు సాధించారు. వీరు స్థానిక శ్రీసిద్ధార్థ హైస్కూల్‌లో చదువుతున్నారు.

ఆనందోత్సాహాలతో బీబీ జైనబ్ జయంతి


మామిడికుదురు పంజాలో మిలాద్‌లో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్యులైన హజరత్ అలీ తనయురాలు బీబీ జైనబ్ జయంతిని సోమవారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మామిడికుదురు అలందార్ అబ్బాస్ పంజాతో పాటు, నగరంలోని మంజిలే కర్బలాలో మిలాద్ జరిగింది. మొహ్మద్ ఖాసిం రజా రజ్వీ ఆధ్వర్యంలో జరిగిన మిలాద్‌లో సుదూర ప్రాంతాల నుంచి ముస్లిం భక్తులు పాల్గొన్నారు. బీబీ జైనబ్ జీవిత చరిత్రలోని ముఖ్య ఘట్టాలను, మహిమలను భక్తులకు వివరించారు. మత ప్రబోధకుడు సయ్యద్ అబ్బాస్ బాకరీ పాల్గొన్నారు.

గురుకులంలో ఇద్దరు విద్యార్థుల అదృశ్యం


గుర్రాల టోనీబాబు మెల్లం నాగేంద్రబాబు

అల్లవరం: మండలంలోని గోడి బాలుర గురుకులంలో తొమ్మిదో తరగతి చదువుతున్న కొమరగిరిపట్నానికి చెందిన మెల్లం నాగేంద్రబాబు, కాట్రేనికోన మండలం భట్టుచెరువు ప్రాంతానికి చెందిన గుర్రాల టోనీబాబు సోమవారం ఉదయం 6 గంటల సమయంలో అదృశ్యమయ్యారని ఎస్‌ఐ హరీష్‌కుమార్ తెలిపారు. గురుకులం పరిసర ప్రాంతాలు, విద్యార్థుల స్వస్థలాల్లో గాలించినా ఆచూకీ దొరకలేదన్నారు. ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. గురుకులం విద్యార్థుల ఆచూకీ తెలిసిన వారు అల్లవరం పోలీస్‌స్టేషన్ ల్యాండ్ నెంబర్ 08856 253433, ఎస్‌ఐ హరీష్‌కుమార్ 94907 60764, రూరల్ సీఐ వీరబాబు 94407 96526 సెల్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇదే గురుకులంలో సెకండ్ ఇంటర్ చదువుతున్న విద్యార్థి జనవరి 31న అదృశ్యమైన విషయం విదితమే. సదరు విద్యార్థిని ఫిబ్రవరి 1న అంబాజీపేట బస్‌స్టేషన్లో పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పది రోజుల వ్యవధిలో ముగ్గురు విద్యార్థుల అదృశ్యంపై సర్వత్రా ఆందోళన నెలకొంది.

గ్రామ పంచాయతీ కార్యాలయం పి.మల్లవరం – తాళ్లరేవు మండలం

ఆ.సెం. /2024 తేది: 12-02-2024

టెండరు నోటీసు

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం గ్రామ పంచాయతీ పరిధిలో [illegible] దీ.10-02-2024వ తేదీన ఉదయం గం.10.30ని.ల నుండి మధ్యాహ్నం గం.1.00ల వరకు [illegible] గం.3.00 [illegible]

క్ర.సం.	పని పేరు	డిపాజిట్ RS.	అంచనాలు
1	[illegible] CC డ్రైన్ నిర్మాణం	7875	3,15,000
2	[illegible] CC డ్రైన్ నిర్మాణం	7500	3,00,000
3	OC కాలనీలో R&B రోడ్డు నుండి [illegible] CC రోడ్ నిర్మాణం	9625	3,85,000
4	OC కాలనీలో [illegible] CC రోడ్ నిర్మాణం	4375	1,75,000
5	[illegible] ఫెన్సింగ్ ఏర్పాటు	12500	5,00,000
6	[illegible] ఫెన్సింగ్ ఏర్పాటు	12500	5,00,000
7	[illegible] పి.మల్లవరం గ్రామ పంచాయతీ [illegible] గ్రావెల్ రోడ్	5000	2,00,000

గమనిక: – 1. దీ.16-02-2024 వ తేదీ సాయంత్రం గం.5.00ల వరకు [illegible] SBI [illegible]
2. దీ.17-02-2024 వ తేదీ ఉదయం గం. 10.30 ని. నుండి సాయంత్రం గం.5.00ల వరకు [illegible]
3. [illegible]
4. [illegible]
5. [illegible]

సం/- దున్నా సత్యనారాయణ, సర్పంచ్, గ్రామ పంచాయతీ, పి.మల్లవరం, తాళ్లరేవు మండలం, కాకినాడ జిల్లా
సం/- ఎస్.వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ, పి.మల్లవరం, తాళ్లరేవు మండలం, కాకినాడ జిల్లా